




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూలై 10, 2026 | సంపుటి : 2 | సంచిక : 268 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# 2047 నాటికి

## 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

♦ దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు

- ♦ తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ♦ ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- ♦ హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ♦ ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్



**హైదరాబాద్,జూలై9 :**
2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు.

మిగతాద్ది 2 లో



వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

# రెండున్నరేళ్లలోనే

## 35వేల కోట్లు రైతులకు అందచేత

- ♦ రైఊతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం
- ♦ బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు
- ♦ ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం,జూలై9 :**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

మిగతాద్ది 2 లో



## స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎస్ భేటీ

**హైదరాబాద్,జూలై9 :**
తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.




## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,జూలై9 :**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.




## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

» 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్షకు కవిత నిర్ణయం

**భద్రాద్రికొత్తగూడెం,జూలై9 :**
తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 భూగర్భగనిని సందర్శించారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

- రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్,జూలై9 :**
మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.


మిగతాది 2లో



## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

- అమరలు కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్

**భద్రాద్రికొత్తగూడెం,జూలై9 :**
బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

మిగతాద్ది 2 లో

## ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

» కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు

» మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి



**వరంగల్,జూలై9 :**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు.

మిగతాది 2లో


మిగతాది 2లో

## సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లు

- సింగరేణి ఆరోపణలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోదు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు కొప్పుల, బాల్క సుమన్ విమర్శలు

**హైదరాబాద్,జూలై9 :**
సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం వాటా 51 శాతం.. కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉందని.. బీజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని లాభాల బాట పట్టించాం.. సింగరేణిలో కారుణ్య నియామకాలను కేసీఆర్ ఇచ్చారు.. జీవో 76 క్రింద వేలాది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు.



## మందల సామేలుకు వ్యతిరేకం కాదు

- ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం
- పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లా
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూలై9 :**
మందల సామేలుకు నేను వ్యతిరేకం కాదు..ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా వ్యతిరేకించడం లేదు..ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం. పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లానని, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

## 'శభాష్ రేవంత్ రెడ్డి.. మిత్రుడంటే మీలా ఉండాలి'




**హైదరాబాద్:**
"శభాష్ రేవంత్ రెడ్డి.. మిత్రుడంటే మీలా ఉండాలి. బండి సంజయ్ పుట్టినరోజుకు సీఎం స్పెషల్ గిఫ్ట్ పంపారు. భగీరథ్‌కు బెయిల్ రావడం బాధాకరం. కోర్టు తీర్పును గౌరవిస్తాం. బాధిత కుటుంబానికి అండగా ఉంటాం" అంటూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. బండి భగీరథ్ బెయిల్‌పై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూలై 10, 2026

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్



## బ్యూరో చీఫ్,కరపత్రం

- పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బిగ్ రిలీఫ్.
- బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు.
- 45 రోజులకు పైగా రిమాండ్‌లో ఉన్న భగీరథ్.

బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో బిగ్ రిలీఫ్ దక్కింది. హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో అతనికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని వారాలుగా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్‌కు న్యాయస్థానంలో ఊరట లభించింది. అయితే బెయిల్ మంజూరు చేసినప్పటికీ కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, కోర్టు విధించిన నిబంధనలను ఉల్లంఘించరాదని ఉన్నత న్యాయస్థానం భగీరథ్‌ను ఆదేశించింది.

2026 మే 8న పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనను బండి భగీరథ్ లైంగిక వేధింపులకు గురి చేశాడని ఓ మైనర్ అమ్మాయి ఫిర్యాదు చేయటంతో కేసు బుక్ అయింది. అనంతరం మే 16న అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న భగీరథ్.. బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున ప్రముఖ సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి హాజరై బలమైన వాదనలు వినిపించారు. భగీరథ్ ఒక విద్యార్థి అని ఇప్పటికే 45 రోజులకు పైగా జైలు శిక్ష అనుభవించడం వల్ల అతని విద్యాసంవత్సరం, భవిష్యత్తు, జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయాడని కోర్టుకు వివరించారు.

పరస్పర అంగీకారంతో జరిగిన ఒక అంశంపై ఇలాంటి తీవ్రమైన కేసులు నమోదు చేయడం చట్టరీత్యా చెల్లదని నిరంజన్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

గతంలో సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన పలు కీలక తీర్పులను ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు.

నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే న్యాయస్థానం విధించే ఎలాంటి కఠిన షరతులకైనా కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.

- మరోవైపు.. ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు ఈ బెయిల్ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు.

కేసు నమోదైన వెంటనే బాధితుల వాంగ్మూలాలను సేకరించామని, దర్యాప్తు తుది దశకు చేరినందున త్వరలోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. ఈ కీలక దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ పీపీ వాదించారు.

ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన తీర్పును వాయిదా వేయగా.. తాజాగా బెయిల్ ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తునకు ఆటంకం కలిగించకుండా, పోలీసుల విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరుకావాలనే నిబంధనలతో న్యాయస్థానం ఈ బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రతి అందిన తర్వాత అవసరమైన షూరిటీలను సమర్పించి బండి భగీరథ్ జైలు నుంచి విడుదల కానున్నారు.

## గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 9**



వరంగల్ పర్యటనలో భాగంగా ఎన్ఐటీ వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో మర్యాద పూర్వకంగా సమావేశమైన ఎంపీ కడియం కావ్య, వరంగల్ ప్రాంత సమగ్ర అభివృద్ధి, ఉన్నత విద్యా రంగ పురోగతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. వరంగల్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఎంపీ ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కూడా ఎంపీ కడియం కావ్య స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

## గవర్నర్, మంత్రికి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఘన స్వాగతం



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 9**

వరంగల్ పర్యటనలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకి, అలాగే కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఘన స్వాగతం పలికిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి

**కరపత్రం ప్రతినిధి జూలై 9**



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటన నిమిత్తం హనుమకొండకు విచ్చేసిన గవర్నర్‌ను వరంగల్ ఎన్ఐటీ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, ఓరుగల్లు పర్యటనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై గవర్నర్‌తో ఆమె కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌కు నిఘా నేత్రాలు.. సీసీ కెమెరాల ప్రారంభంతో గ్రామ భద్రతకు కొత్త బలం

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం చేతుల మీదుగా ప్రారంభం -- ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థ బలోపేతం కావాలని పిలుపు**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ రాజారాం, ఉపసర్పంచ్ ఉష్కమల్ల తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, విద్యాసంస్థల పరిసరాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఈ నిఘా కెమెరాలను ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ అలాం మాట్లాడుతూ, ఆధునిక కాలంలో సీసీ కెమెరాలు గ్రామాలకు అదనపు పోలీసుల్లా పనిచేస్తున్నాయని అన్నారు. నేరాల నియంత్రణ, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను వేగంగా గుర్తించి చట్టం



ముందు నిలబెట్టేందుకు సీసీ కెమెరాల దృశ్యాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, అదే స్థాయిలో ప్రజలు కూడా తమ గ్రామ భద్రత పట్ల బాధ్యత వహించాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగితే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అన్నారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి మాట్లాడుతూ, పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు గ్రామ ప్రజలు విశేషంగా సహకరిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని, యువత కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. గ్రామ సర్పంచ్ రాజారాం మాట్లాడుతూ, గ్రామ ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గ్రామస్తుల



సహకారంతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, అవసరమైన చోట్ల మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ ఉష్కమల్ల తిరుపతి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆదర్శ గ్రామంగా సైదాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్, రూరల్ సీఐ వెంకట్, ఎస్సైలు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పోలీస్ కమిషనర్ పరిశీలించి, వాటి నిర్వహణపై సంబంధితులకు సూచనలు చేశారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి నేడు విద్యాసంస్థల బంద్ హకీమ్ నవీద్

**కరపత్రం ప్రతినిధి వరంగల్/హైదరాబాద్,జూలై 10**



రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో పూర్తిస్థాయిలో విఫలమైందని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇంతకాలం గడిచినా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను విరమించుకోవడం,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు,ఎంఈవో,డీఈవో,లెక్చరర్ పోస్టులను భర్తీ చేయడం,ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావడం,పెండింగ్ స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం వంటి పలు డిమాండ్లను ఆయన ప్రభుత్వ ముందుంచారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు,తాగునీరు,మరుగుదొడ్లు,ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలని,విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం,బస్ పాసులు అందించాలని కోరారు. జూలై 10న నిర్వహిస్తున్న బంద్‌కు ప్రభుత్వ,ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని హకీమ్ నవీద్ విజ్ఞప్తి చేశారు.

## కోరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విభాగం ప్రారంభం

**ముఖ్య అతిథిగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం --చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి శుభారంభం**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండలం కోరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026--2027 విద్యా సంవత్సరానికి ప్రీ-ప్రైమరీ విభాగాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రీ-ప్రైమరీ విద్యేనని అన్నారు. చిన్నారుల్లో నేర్చుకునే ఆసక్తి, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించడంలో ఈ దశ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, నాణ్యమైన బోధనను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అతిథులుగా పాల్గొన్న హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్, మండల విద్యాధికారిణి మంథని హేమలత, గ్రామ సర్పంచ్ మధుసూదన్, ఉపసర్పంచ్ రాజు, అమ్మ



ఆదర్శ పాఠశాల చైర్మన్ స్రవంతి కలిసి ప్రీ-ప్రైమరీ తరగతి గదిని రిబ్బన్ కటింగ్ ద్వారా ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిణి మంథని హేమలత మాట్లాడుతూ, బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించే అత్యంత ముఖ్యమైన దశ ప్రీ-ప్రైమరీ విద్య అని పేర్కొన్నారు. ఆటల ద్వారా నేర్చుకునే విధానం, సృజనాత్మక బోధన, పిల్లల మానసిక వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఏసీపీ మాధవి, మండల విద్యాధికారిణి మంథని హేమలతలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలను అందజేసి





తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దబ్బెట రవీందర్, సీనియర్ ఉపాధ్యాయులు గుడిమిల్ల బలరాం, సంగసాని కుమారి, ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయురాలు షైనీ శైలజ, వి.వి. రేఖ, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జర్నలిస్టుల ఫిర్యాదు: బెదిరింపుల ఆరోపణలు

**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 9**



ప్రజా సమస్యలకు సంబంధించిన వార్తల ప్రచురణ అనంతరం తమను బెదిరించారని ఆరోపిస్తూ ముగ్గురు జర్నలిస్టులు వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

వల్లభాపూర్ గ్రామానికి చెందిన జర్నలిస్టు కుమార్ యాదవ్ కొంగలతో పాటు పాత్రికేయులు పాంతటి రవీందర్, రసీదు వేర్వేరుగా సమర్పించిన ఫిర్యాదుల్లో పేర్కొన్న వ్యక్తి ఫోన్ ద్వారా తమను బెదిరించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఫిర్యాదుల ప్రకారం, గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు తమ సమస్యను మీడియా దృష్టికి తీసుకురావడంతో సంబంధిత వివరాలను సేకరించి వార్తలు ప్రచురించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. కుమార్ యాదవ్ తన ఫిర్యాదుకు మద్దతుగా ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డును పోలీసులకు అందజేసినట్లు తెలిపారు. అదే ఘటనకు సంబంధించి తామూ బెదిరింపులకు గురయ్యామని ఆరోపిస్తూ మిగిలిన ఇద్దరు పాత్రికేయులు కూడా ఫిర్యాదులు సమర్పించారు. జర్నలిస్టుల విధి నిర్వహణకు భంగం కలిగించే చర్యలపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టర్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్సులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూలై 10, 2026

## ఆబాది జమ్మికుంటలో వనమహోత్సవం.. మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**
పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి ఇంటి ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



(దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఆబాది ప్రాంతంలో ప్రతి ఇంటి చుట్టూ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నందున ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు పెంచడం వల్ల పరిసరాలు ఆహ్లాదకరంగా మారడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. పచ్చదనం పెరగడం ద్వారా వాతావరణ సమతుల్యత నెలకొని, వర్షాలు సకాలంలో కురిసేందుకు కూడా చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, నేటి తరానికి మాత్రమే కాకుండా భావితరాలకు కూడా పచ్చని పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు ఎగిత సుజాత--అశోక్, మైస శిరీష--రవి, గణేష్, భిక్షపతి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ బార్ హాల్‌కు రూ.5 లక్షలు.. మరో రూ.5 లక్షల హామీ ప్రొసీడింగ్ కాపీ అందజేత



**ప్రభుత్వ విప్ ఆదిని శాలువాతో సన్మానించిన న్యాయవాదులు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ కోర్టు ప్రాంగణంలో బార్ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ప్రొసీడింగ్స్ కాపీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బార్ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అదనంగా మరో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అవసరమని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్, అదనపు రూ.5 లక్షలు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ సానుకూల స్పందనపై బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

## రాజన్న ఆలయ డిప్యూటీ ఈవోగా ప్రతాప నవీన్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ)గా శ్రీ ప్రతాప నవీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టే ముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉద్యోగుల సంఘం తరపున



ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 09:**
మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం ఈ నెల 24న పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలో బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి



ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రామగుండం నియోజకవర్గ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్‌ను వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నమని అలాగే ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000 అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గోదావరిఖని పరిసర ప్రాంతాల యువకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని వ్యాళ్ల హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు నుచెట్టి యుగంధర్, కిరణ్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడమండ శ్రీహరి, కొండ సురేష్, పోయిల రవికుమార్, ఉదయ్, బూరుగు వంశీ, అల్లి గణేష్, కడరా శ్రీధర్ నిజం, అజేయ్‌స్త్ర, అరుణ్ సాయి, భూక్యా కుమార్ సంతోష్, షాదీక్, ఆర్యా, తోపాటు క్రీడాకారులు స్థానిక యువత పాల్గొన్నారు.

## 2002 ఓటరు జాబితా ఆధారంగానే ఓటు నమోదు చేసుకోవాలి: ఆకుల రాజేందర్

**జమ్మికుంట 27వ వార్డులో బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు హెల్ప్‌లైన్ నిర్వహణ**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**
ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని, ప్రతి ఒక్కరూ 2002 ఓటరు జాబితా ఆధారంగా తమ ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కృష్ణ కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్‌లైన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఏ--2లతో కలిసి పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఉన్న ఓటరు వివరాలు మాత్రమే సరిపోవని, ఎన్నికల అధికారులు 2002 ఓటరు జాబితా ఆధారంగా మ్యాపింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అధికారులు అందజేసిన ఫారాలను పూర్తిగా నింపి, ఫోటోను జత చేసి సమర్పించిన వారికే కొత్త ఓటరు నమోదు జరుగుతుందని, లేకుంటే ఓటు నమోదు కాకపోయే అవకాశం ఉందని వివరించారు. ప్రజలందరూ ఈ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అలాగే బీఎల్ఓలు, బీఎల్ఏ--2లు ఎప్పటికప్పుడు ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలో స్థానికంగా నివసించని వారి పేర్లు ఉన్నట్లు గుర్తిస్తే



వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని, దొంగ ఓట్లకు అవకాశం లేకుండా బీజేపీ బీఎల్ఏ--2లు పకడ్బందీగా పనిచేయాలని ఆకుల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, కేశ స్వరూప్, బీఎల్ఏ--2 కనుబోయిన బద్రి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు చుక్కల గంగాభవాని, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల వైపు అడుగులు వేయాలి.. సమాజానికి ఆదర్శంగా నిలవాలి

**జమ్మికుంటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వాలీబాల్ పోటీలు --**
**విజేతలకు బహుమతులు అందజేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**
యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలంటే క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం కేటాయించకుండా క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనం, జట్టు భావన పెంపొందుతాయని, ఇవే భవిష్యత్ విజయాలకు పునాది అవుతాయని అన్నారు. పోలీస్ శాఖ ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా యువతను సన్మార్గంలో నడిపించే సామాజిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి, సైబర్ నేరాలు,



ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని యువతకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా ప్రతిభకు కొదవ లేదని, సరైన ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పోటీల్లో జమ్మికుంట పట్టణం, పరిసర గ్రామాల నుంచి పలు జట్లు పాల్గొని ఉత్కంఠభరితంగా పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ఆటతీరును ప్రదర్శించిన బిజిగిరి షరీఫ్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, ఇందిరానగర్ జట్టు ద్వితీయ బహుమతిను కైవసం చేసుకుంది. విజేత జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, ఓటమిని నిరుత్సాహంగా కాకుండా విజయానికి తొలి మెట్టుగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కమిషనర్ ముచ్చటిస్తూ వారి ప్రతిభను కొనియాడారు. క్రమం తప్పకుండా సాధన చేస్తే ఉన్నత స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇటువంటి క్రీడా పోటీలను



భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి మాట్లాడుతూ యువత క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్, రూరల్ సీఐ వెంకట్‌లు పోటీల నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్, రూరల్ సీఐ వెంకట్, టౌన్ సిఐ కరుణాకర్ ఎస్ఐలు రమేష్, శేఖర్ రెడ్డి, ఆవుల తిరుపతి క్రాంతి కుమార్ కే స్వాతి. పోలీస్ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విజేత జట్లను ఘనంగా సన్మానించగా, పాల్గొన్న యువత పోలీస్ శాఖ చేపట్టిన ఈ క్రీడా కార్యక్రమాన్ని అభినందించారు. జమ్మికుంట ప్రాంతంలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు నిరంతరం నిర్వహించాలని వారు కోరారు.

## ఎస్ఐఆర్ ఫారంపై ప్రజల్లో అపోహలు వద్దు.. ప్రతి ఒక్కరూ ఫారం తప్పనిసరిగా నింపాలి: మున్సిపల్ చైర్మన్ కమిషనర్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 9:**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జమ్మికుంట పట్టణంలోని ఆబాది ప్రాంత ప్రజలకు ఎస్ఐఆర్ ఫారం నింపే విధానంపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) కమిషనర్ మల్లికార్జున స్వామి అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడిన ఆయన, ఫారం నింపే విధానం, అవసరమైన వివరాలపై స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కమిషనర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఫారంపై ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. 2002 సంవత్సరంలో ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటు నమోదైన వివరాలను ఫారంలో నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ 2002లో ఓటు హక్కు లేకపోతే, తల్లిదండ్రులలో ఎవరికైనా ఉన్న ఓటరు వివరాలను నమోదు చేయాలని చెప్పారు. అలాగే ఇటీవల



వివాహం చేసుకున్నవారు కూడా తమ తల్లిదండ్రులలో ఎవరి ఓటరు వివరాలనైనా పొందుపరచవచ్చని వివరించారు. ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)కు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. సరైన వివరాలతో ఫారం సమర్పించడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందుతుందని



పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు ఎగిత సుజాత--అశోక్, మైస శిరీష--రవి, ఆర్‌పీలు, బీఎల్ఓలు, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తూ, ప్రతి కుటుంబం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

## వార్త రాసిన జర్నలిస్టుకు బెదిరింపులు.. దొమ్మటి వెంకన్నపై పోలీసులకు ఫిర్యాదు

**ప్రజా సమస్యలపై కథనం ప్రచురించడమే కారణమని ఆరోపణ..**
**ఆడియో రికార్డుతో వీణవంక పోలీసులను ఆశ్రయించిన జాతీయ భూమి ఎడిటర్ పంతాటి రవీందర్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట/వీణవంక, జూలై 9:**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ వార్తలు ప్రచురించినందుకు తనను తీవ్రంగా బెదిరించారని ఆరోపిస్తూ జాతీయ భూమి తెలుగు దినపత్రిక ఎడిటర్, జర్నలిస్టు పంతాటి రవీందర్ వీణవంక పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. వల్బభాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు శంకరయ్య, లక్ష్మి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఫిర్యాదు చేయగా, వారి వాదన ఆధారంగా వార్త ప్రచురించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, వృద్ధ దంపతులకు ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా వారిని బెదిరిస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న దొమ్మటి వెంకన్నపై వార్త ప్రచురించడంతో అతడు ఆగ్రహానికి గురయ్యాడని పేర్కొన్నారు. అనంతరం ఒక పాత్రికేయ మిత్రునికి ఫోన్ చేసి, “నీ అంతు చూస్తా... నిన్ను వదిలిపెట్టను” అంటూ తనను లక్ష్యంగా చేసుకుని తీవ్ర హెచ్చరికలు చేశాడని రవీందర్ ఆరోపించారు. ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డును సాక్ష్యంగా పోలీసులకు అందజేసినట్లు తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా బాధ్యతల పరిధిలో వార్తలు ప్రచురించడం తన వృత్తి ధర్మమని, అలాంటి విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టును బెదిరించడం చట్టవిరుద్ధమైన



చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భద్రతపైనా ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. దొమ్మటి వెంకన్న వల్ల తనకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు పూర్తి బాధ్యత అతనిదేనని ఫిర్యాదులో స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద దొమ్మటి వెంకన్నపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు, తన కుటుంబ సభ్యులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని వీణవంక పోలీసులను కోరారు.